# ఆయన మనకు లేఖనమును అనుగ్రహించాడు: వ్యాఖ్యానమునకు పునాదులు

ఐదవ పాఠము

## అర్థము యొక్క సంక్లిష్టత

Manuscript

thirdmill

Biblical Education. For the World. For Free.

© 2012 థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్

సర్వహక్కులు ప్రచురణకర్తలవే. ఈ ప్రచురణలోని ఏ భాగమైనను ఏ రూపములోనైనను లేదా ఏ సాధనము ద్వారానైనను ప్రచురణకర్తలైన, థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్, ఐఎన్సి, 316 లైవ్ ఓక్స్ బిఎల్విడి, కాసిల్ బెర్రీ, ఫ్లోరిడా 32707, నుంచి వ్రాతమూలకమైన అనుమతి పొందకుండా పునఃసమీలలో క్లుప్తంగా ఉల్లేఖింపబడుట, వ్యాఖ్యానించుట, లేదా పాండిత్యము సంపాదించు ఉద్దేశం కొరకు మినహాయిస్తే, పునఃర్ముద్రింపబడకూడదు.

మరొక విధంగా సుచింపబడితే తప్ప ఇందులోని లేఖన ఉల్లేఖనములన్నియు తెలుగు OV వెర్షన్ నుండి తీసికొనబడినవి. కాపిరైట్ © ది బైబిల్ సొసైటీ అఫ్ ఇండియా.

## థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్

1997లో స్థాపింపబడిన థర్డ్ మిలీనియం పరిచర్యలు ఒక లాభాపేక్షలేని క్రైస్తవ వ్యవస్థగా లోకమునకు ఉచితముగా బైబిలు సంబంధమైన విద్యను సమకూర్చు నిమిత్తము ప్రతిష్టింపబడింది.

**బైబిలు విద్య. లోకము కొరకు. ఉచితముగా.**

వర్తమాన కాలములో హితమైన, లేఖనానుసారమైన క్రైస్తవ నాయకత్వ శిక్షణ కొరకు ఇతోధికంగా అధికమవుతున్న విశ్వవ్యాప్త అవసరతకు ప్రతిస్పందనగా, మేము తేలికగా ఉపయోగించడానికి వీలైన, దాతల పోషణతో, బహుముఖ ప్రసార మాధ్యమముల ద్వారా ప్రయోగింపబడగల వేదపాఠ అధ్యయన శాల పాఠ్య క్రమమును ఐదు ప్రధాన భాషలలో (ఇంగ్లీష్, స్పానిష్, రష్యన్, మాండరిన్ చైనీస్, మరియు అరబిక్) సిద్ధం చేస్తున్నాము మరియు ఇది అత్యావశ్యకమైయున్నవారికి, ప్రాథమికంగా సంప్రదాయిక విద్యనభ్యసించడానికి అందుబాటులేని, లేదా ఆర్థికంగా భరించలేని క్రైస్తవ నాయకులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నాము. పాఠములన్నియు రచింపబడినవి, రూపొందింపబడినవి, మరియు సంస్థలోపలే సిద్ధంచేయబడుతున్నవి, మరియు శైలి మరియు నాణ్యతలో హిస్టరీ ఛానల్©లో ప్రసారమగువాటి వలెనున్నవి. క్రైస్తవ నాయకులకు శిక్షణ నిచ్చుటకు ఈ అసమానమైన, ఖర్చుకు తగిన ఫలితమునిచ్చు పద్ధతి చాలా కార్యసార్థకమైనదై యున్నదని ప్రపంచమందంతటను రుజువయ్యింది. విద్య మరియు సజీవ వ్యంగ్య చిత్రముల ఉపయోగములో ప్రయోజనపడు విశిష్టమైన వీడియో చిత్రముల ఉత్పత్తి విషయంలో మేము టెల్లి అవార్డ్స్ గెలుచుకున్నాము, మరియు మా పాఠ్య క్రమము ప్రస్తుతము 192 కంటే ఎక్కువ దేశాలలో ప్రయోగింపబడుతుంది. థర్డ్ మిలీనియం పరిచర్యల యొక్క సాహిత్యం మొదలగు వస్తువులైన డీవీడీ, ముద్రణ, ఇంటర్నెట్, ఉపగ్రహ దూరదర్శిని ప్రసారములు, మరియు రేడియో మరియు దూరదర్శిని ప్రసారముల రూపంలో వాడబడుతున్నవి.

ఈ పరిచర్యలను గూర్చి మరియు మీరు మాతో కలసి ఎలా పరిచర్య చేయవచ్చునో తెలిసికొనగోరుచున్నట్లయితే, అదనపు సమాచారం కొరకు http://thirdmill.org ను సందర్శించండి.

# విషయ సూచిక

ఉపోద్ఘాతం ..........................................................................................................1
అక్షరార్థ భావన .......................................................................................................2
పలు అర్థములు ...................................................................................................... 3
ఏక అర్థము ............................................................................................................. 8
సంపూర్ణ విలువ .....................................................................................................12
వాస్తవిక అర్థము ..................................................................................................... 13
బైబిలు ఉల్లేఖనములు ............................................................................................ 15
సరియైన అనువర్తనములు....................................................................................... 19
ముగింపు ............................................................................................................23



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

# ఆయన మనకు లేఖనమును అనుగ్రహించాడు:

# వ్యాఖ్యానమునకు పునాదులు

ఐదవ పాఠము

అర్థము యొక్క సంక్లిష్టత

## ఉపోద్ఘాతం

బైబిలు వ్యాఖ్యానశాస్త్రములో వాడుకగా చెప్పు ఒక పురాతనమైన మాట ఉన్నది. అది ఏమనగా, “ఒకే అర్థము ఉన్నదిగాని, ఆ అర్థమునకు అనేక అనువర్తనములు ఉన్నాయి.” ఉదాహరణకు, “నీ పొరుగువానిని ప్రేమించుము” అను ఒక సులువైన సూటైన హెచ్చరికను బైబిలు మనకు ఇస్తుంది. అయితే పలు సందర్భములలో, విభిన్నమైన పొరుగువారితో మనము వ్యవహరించుచుండగా ఈ హెచ్చరికను మన జీవితములకు విభిన్నమైన రీతులలో అనువర్తించుకోవాలి.

ఇప్పుడు, ఈ మెళకువ ఎంత సహాయకరముగా ఉన్నాగాని, లేఖనములను వ్యాఖ్యానించు విషయానికి వచ్చేసరికి, ప్రతి బైబిలు భాగము యొక్క అర్థము సంక్లిష్టమైనది అని లేక పలు కోణములను కలిగినది అని మనము గుర్తించాలి. కాబట్టి, “ఒకే అర్థము ఉన్నది కాని అనేక అనువర్తనములు ఉన్నాయి” అని చెప్పుటకు బదులుగా, ఇలా చెప్పుట మరింత సహాయకరముగా ఉంటుంది: “ఒకే అర్థము ఉంది కాని, ఆ ఒక్క అర్థమునకు అనేక క్లుప్త సారాంశములు ఉన్నాయి. మరియు ఇంకా ఎన్నో అనువర్తనములు ఉన్నాయి.” ప్రతి బైబిలు భాగము యొక్క ఒకే అర్థము ఎంత సంక్లిష్టమైనది అంటే, దానిని అనేక విభిన్నమైన విధములుగా క్రోడీకరించి, దానిని మన జీవితములకు అనువర్తించుకొనుటను మనము నేర్చుకోవాలి.

*ఆయన మనకు లేఖనమును అనుగ్రహించెను: వ్యాఖ్యానమునకు పునాదులు* అను మన పాఠ్యక్రమములో ఇది ఐదవ పాఠము. దీనికి “అర్థము యొక్క సంక్లిష్టత” అను శీర్షికనిచ్చాము, ఎందుకంటే అనేక యుగములుగా క్రైస్తవులు బైబిలు భాగములకు అనేక రకముల మరియు విభిన్నమైన అర్థమును ఇచ్చిన విధానములను దీనిలో మనము విశదీకరించబోతున్నాము.

బైబిలులోని అర్థము యొక్క సంక్లిష్టతను గూర్చి మనము చేయు చర్చ రెండు భాగములుగా విభాగించబడుతుంది. మొదటిగా, లేఖనము యొక్క “అక్షరార్థ భావన” అని వ్యాఖ్యానకర్తలు పిలచినదానిని మనము చూద్దాము. మరియు రెండవదిగా, లేఖన భాగము యొక్క సంపూర్ణ విలువను, అనగా అనేక విధాలుగా అక్షరార్థ భావనను మించియున్న విధానము మీద దృష్టిపెడదాము. ముందుగా లేఖనము యొక్క అక్షరార్థ భావనను చూద్దాము.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

## అక్షరార్థ భావన

కొన్నిసార్లు ల్యాటిన్ వ్యక్తీకరణయైన సెన్సస్ *లిటరలిస్* ద్వారా వ్యక్తపరచబడు "అక్షరార్థ భావన" అను పదమును, "అక్షరార్థ వ్యాఖ్యానము" అను పదముగా పరిగణించి నేడు చాలాసార్లు ప్రజలు పొరపాటుపడుతుంటారు. "అక్షరార్థ వ్యాఖ్యానము" అనగా బైబిలును అర్థము చేసుకొనుటకు ఉపయోగించు యాంత్రిక దృష్టికోణమును సూచిస్తుంది. అయితే చారిత్రికముగా, "అక్షరార్థ భావన" అను పదము నేడు అనేకమంది ఇవాంజెలికల్ క్రైస్తవులు పిలచు లేఖన భాగము యొక్క "వాస్తవిక అర్థము" లేక "వ్యాకరణ-చారిత్రిక అర్థము"ను సూచిస్తుంది.

అక్షరార్థ భావన లేఖనములోని మాటలను మరియు వాక్యములను రచయిత యొక్క ఉద్దేశములు మరియు వారి వాస్తవిక శ్రోతల యొక్క చారిత్రిక నేపథ్యములకు అనుగుణంగా పరిగణిస్తుంది.

ఇది లేఖనములో ఉన్న విభిన్నమైన రచనా శైలుల మీద దృష్టిపెడుతుంది. రూపకములు, ఉపమానములు, ఉదాహరణలు మరియు అతిశయోక్తులు మొదలగు భాషా భాగములను ఇది గుర్తిస్తుంది. ఇది చరిత్రను చరిత్రగా, పద్యభాగమును పద్యభాగముగా, సామెతలను సామెతలుగా పరిగణిస్తుంది.

> బైబిలు పుస్తకములలో అనేక రకముల విభిన్నమైన రచనా శైలులు ఉన్నాయి, మరియు వాటిని సరిగా అర్థము చేసుకొనుటకు మరియు వ్యాఖ్యానించుటకు ఆ శైలులలోని భిన్నత్వములను అర్థము చేసుకొనుట చాలా అవసరమైయున్నది. ఒకే పనిని ఒకే విధముగా చేయుటకు మనము శైలులన్నిటిని అర్థము చేసుకోలేము. కాబట్టి బైబిలు పుస్తకముల యొక్క శైలులను అర్థము చేసుకొనుట ద్వారా మరియు వాటి మీద దృష్టిపెట్టుట ద్వారా, ఆ పుస్తకములను వ్యాఖ్యానించవలసిన విధానమును గూర్చి స్వయంగా ఆ పుస్తకములు దిశానిర్దేశం చేయునట్లు మనము అవకాశం ఇస్తాము.
>
> — డా. బ్రాండన్ క్రో

ఒక బైబిలు భాగము యొక్క అక్షరార్థ భావనలో కేవలం పేజీలో వ్రాయబడిన పదముల కంటే ఎక్కువ అర్థము ఉంటుంది అని మనము చూసినప్పుడు, ప్రతి వాక్యభాగము యొక్క సెన్సస్ *లిటరలిస్* ఎంత సంక్లిష్టమైనదిగా ఉంటుందో మనకు అవగాహన కలుగుతుంది. రచయితల యొక్క ఉద్దేశములు పలు కోణములు కలిగినవిగా ఉన్నాయి. శైలుల పరిగణ ఒక వాక్యభాగము యొక్క అర్థమును సంక్లిష్టము చేస్తుంది. భాషా భాగములు మొదలగునవి కూడా అనేక పరిగణలను పరిచయం చేస్తాయి. ఈ కారకములు ప్రతి బైబిలు భాగము యొక్క వాస్తవిక అర్థములో ఉన్న లెక్కలేనన్ని చిక్కులను బయలుపరుస్తాయి. మరియు ఈ సంక్లిష్టతలు లేఖనము యొక్క అర్థమును అనేక విధములుగా ఆశ్రయించునట్లు సద్భావన గల క్రైస్తవులను పురికొల్పాయి.

చరిత్రయందంతటా, బైబిలు భాగముల యొక్క వాస్తవిక అర్థమును లేక అక్షరార్థ భావనను కనుగొనవలసిన అవసరతను క్రైస్తవులు ఏకకంఠముతో ఉద్ఘాటించారు. అయితే లేఖనము యొక్క అర్థము ఎంత సంక్లిష్టమైనదిగా ఉన్నది అంటే, దానిని అక్షరార్థ భావనలో సరియైన విధముగా క్రోడీకరించలేము అని మరికొందరు వాదించారు. కాబట్టి, మన పాఠములోని ఈ భాగములో, అక్షరార్థ భావనను సరిగా అర్థము చేసుకుంటే అది లేఖనము యొక్క సంక్లిష్టమైన అర్థమును పరిశోధించుటలో మరియు వర్ణించుటలో మనకు సహాయపడగలదు అని చూచుటకు "అక్షరార్థ భావన" అను పదము యొక్క చరిత్రను మనము విశదీకరిద్దాము.

లేఖనములోని అర్థము యొక్క సంక్లిష్టత దాని యొక్క అక్షరార్థ భావనతో అనుబంధము కలిగియుండిన రెండు ప్రధానమైన మార్గములను మనము చూద్దాము. మొదటిగా, అక్షరార్థ భావన లేఖనములో ఉన్న పలు అర్థములలో ఒకటి మాత్రమే అయ్యున్నదని కొందరు క్రీస్తు అనుచరులు చెప్పినట్లు మనము చూద్దాము. మరియు రెండవదిగా, అక్షరార్థ భావన బైబిలు యొక్క ఏక అర్థము అయ్యున్నది అను ఆలోచన మీద దృష్టిపెడదాము. అక్షరార్థ భావన లేఖనములో ఉన్న పలు అర్థములలో ఒకటి మాత్రమే అయ్యున్నది అను నమ్మకమును ముందుగా చూద్దాము.

## పలు అర్థములు

ఆదిమ సంఘములో, లేఖనమునకు పలు అర్థములు కలవు అను ఆలోచన వ్యాఖ్యానశాస్త్రమును రూపకముల దృష్ట్యా చూచుటలో నుండి వెలువడింది. రూపక దృష్టికోణము లేఖనములో వర్ణించబడిన చారిత్రిక ప్రజలను, స్థలములను, వస్తువులను, మరియు సన్నివేశములను ఆత్మీయ సత్యములకు చిహ్నములుగా లేక రూపకములుగా వర్ణిస్తుంది. ఒక చెట్టు రాజ్యమును సూచించుట, ఒక యుద్ధము పాపముతో అంతరంగములో జరుగు సంఘర్షణను సూచించుట, మొదలగునవి. రూపక వ్యాఖ్యానములలో, బైబిలులో వర్ణించబడిన భౌతిక వాస్తవికతలు చాలాసార్లు చిన్నచూపు చూడబడతాయి, మరియు ప్రాముఖ్యతలేనివిగాను లేక అసత్యములుగాను కొట్టివేయబడతాయి కూడా. మరియు ఈ భౌతిక వాస్తవికతల ద్వారా ప్రాతినిధ్యం వహించబడిన ఆత్మీయ ఆలోచనలు లేఖనములో ఎక్కువ ప్రాధాన్యతగల విషయములుగా పరిగణించబడతాయి.

క్రైస్తవ రూపక విధానములను కొన్నిసార్లు క్రీ.పూ 20 నుండి క్రీ.శ. 50 మధ్య కాలములో నివసించిన యూదా పండితుడైన అలెగ్జెంధ్రియాకు చెందిన ఫిలోకు ఆపాదిస్తారు. హెబ్రీ లేఖనములను ఉన్నతమైన ఆత్మీయ సత్యములను బయలుపరచిన రూపకములుగా చూచుట ద్వారా క్రైస్తవ రూపక పద్ధతులకు ఫిలో పునాదులు వేశాడు.

ఫిలో తరువాత, సంఘము యొక్క ఆరంభ సంవత్సరములలో, బైబిలులోని పాత మరియు క్రొత్త నిబంధనలను వ్యాఖ్యానించుటకు ప్రఖ్యాతిగాంచిన క్రైస్తవ పండితులు ఇలాంటి పద్ధతినే ఉపయోగించారు.

వేదాంత విద్యార్థులకు బైబిలు వ్యాఖ్యానమును మరియు వేదాంతశాస్త్రమును బోధించిన అలెగ్జెంద్రియా కేటకెటికల్ స్కూల్ విశేషముగా ఈ పద్ధతిని అనుసరించింది.

ఈ కేటకెటికల్ స్కూల్ లో ప్రఖ్యాతిగాంచిన వ్యక్తి, క్రీ.శ. 185 నుండి సుమారుగా క్రీ.శ. 254 మధ్య కాలములో నివసించిన ఓరిగన్. ఓరిగన్ లేఖన అర్థమును రెండు విభాగములుగా విభజించాడు: అక్షరార్థ భావన మరియు ఆత్మీయ భావన. 2 కొరింథీ. 3:6లో అక్షరము మరియు ఆత్మ నియమమునకు మధ్య చూపిన వ్యత్యాసమును ఉపయోగిస్తూ, లేఖనములోని ప్రతి వాక్యభాగములో ప్రధానముగా రెండు రకముల అర్థము ఉన్నదని ఓరిగన్ తెలిపాడు: వాక్యభాగము యొక్క అక్షరము మరియు వాక్యభాగము యొక్క ఆత్మ. "అక్షరము" అను పదమును ఉపయోగిస్తూ ఓరిగన్ వ్యాకరణ నేపథ్యములోని పదముల యొక్క స్పష్టమైన అర్థమును ఉద్దేశించాడు. మరియు వాక్యభాగము యొక్క "ఆత్మ" అను పదమును ఉపయోగిస్తూ, అతడు అలంకారిక భావనలను ఉద్దేశించాడు — పదముల యొక్క స్పష్ట భావనలను మించిన అర్థములు. ఓరిగన్ వాక్యభాగము యొక్క అక్షరమును దాని యొక్క అక్షరార్థ అర్థముతో సరిపోల్చినట్లు అనిపిస్తుంది, మరియు అతడు అక్షరార్థ అర్థము యొక్క అధికారమును సమర్థించాడు. అయితే దీనికి తోడు, లేఖనము యొక్క ఆత్మీయ భావనను కనుగొనుటకు పరిపక్వత చెందిన ఆత్మీయ విశ్వాసులు అక్షరార్థ అర్థమును మించి చూడాలని ఓరిగన్ వాదించాడు.

ఉదాహరణకు, తన రచనయైన *ఆన్ ఫస్ట్ ప్రిన్సిపిల్స్*, 4వ పుస్తకము, 1వ అధ్యాయము, 16లో భాగములో, ఆదికాండము 1 మరియు 2 అధ్యాయములలో ఉన్న సృష్టి వృత్తాంతములు తర్కమునకు వ్యతిరేకముగా ఉన్నాయని, కాబట్టి క్రైస్తవులు వాటి యొక్క అక్షరార్థ భావనను నిర్లక్ష్యం చేసి, లోతైన ఆత్మీయ అర్థముల కొరకు చూడాలని ఓరిగన్ వాదించాడు. నిరాశ్చర్యంగా, ఓరిగన్ యొక్క రూపక విధానములు చరిత్రలో అనేక సార్లు విమర్శించబడినవి. అయితే అతని విధానములు ఆదిమ క్రైస్తవ వ్యాఖ్యానశాస్త్రము యొక్క దిశ మీద గొప్ప ప్రభావమును చూపాయి.

> జాన్ క్రిసోస్టం వంటి కొందరు ప్రాచీన వ్యాఖ్యానకర్తలు అపొస్తలుల కార్యములు వంటి బైబిలు కథనములపై అద్భుతమైన మెళకువలను కలిగియుండిరి, మరియు అతడు వాటిని మరింత అక్షరార్థంగా చదువుటకు ప్రయత్నించాడు. మనము సాధారణంగా కథనములను చదువు విధానములో, కథనము చెప్పుచున్న విషయములను విని, ఆ కథనములో నుండి పాఠములను లేక నైతిక విషయములను వెలికితీయుటకు ప్రయత్నిస్తాము. ఓరిగన్ వంటి ఇతర వ్యాఖ్యానకర్తలు రూపకముగా వ్యాఖ్యానించుటకు, వాటిని కొన్ని చిహ్నముల క్రమముగా మలచుటకు ప్రయత్నించారు, మరియు ఇట్టి పద్ధతిలో ఉన్న అపాయము ఏమిటంటే మనము అర్థము చేసుకొనుట కొరకు వాస్తవానికి బైబిలు ఆ విధంగా వ్రాయబడలేదు. ఈ పద్ధతి వాస్తవానికి పురాతన పురాణములను, పురాతన పురాణములలోని ఇబ్బంది కలిగించు విషయములను వివరించుటకు గ్రీకు తత్వవేత్తలు ఉపయోగించిన పద్ధతిలో నుండి వెలువడింది,

> మరియు కొన్నిసార్లు బైబిలును చదువుటకు ఈ పద్ధతిని ఉపయోగించారు. వాక్యభాగము స్వయంగా చెబుతున్న దానిని వినుటకు వారు ఇక ప్రయత్నించలేదు. దానికి వేరొక అర్థమును ఇచ్చుటకు ప్రయత్నించుట ద్వారా వారు దానిని మరింత ప్రేరితమైనదిగా చేయుటకు ప్రయత్నించారు. అదే సమయములో, ఓరిగస్ కొన్నిసార్లు కొన్ని మంచి మెళకువలను కూడా ఇచ్చాడు.
>
> — డా. క్రైగ్ ఎస్. కీనర్

బైబిలును ఆత్మీయముగా లేక రూపకముగా చదవాలని ఓరిగన్ కలిగియుండిన ఆశ ఆదిమ సంఘము మీద నియో-ప్లేటోవాదము చూపిన ప్రభావములో ప్రతిబింబించబడింది. ఈ అభిప్రాయములో, శుద్ధమైన పరలోక ఆత్మ అయిన దేవుని నుండి లేఖనము వచ్చింది. ఫలితంగా, లేఖనములు భౌతిక లోకమును గూర్చి బోధించలేదు అని ప్రజలు ఊహించారు. లోకము స్వాభావికముగా దుష్టమైయున్నది. కాబట్టి, చరిత్రలో జరిగిన భౌతిక విషయములను లేఖనములు ప్రస్తావించినప్పుడు, అవి వాస్తవానికి రూపకము ద్వారా వివేచించబడగల పరలోక, ఆత్మీయ సత్యముల వైపుకు చూపాయి. ఈ అభిప్రాయం ప్రకారం, లేఖనము యొక్క వాస్తవిక అర్థము ఈ ఉన్నతమైన ఆత్మీయ సత్యములలో ఉన్నది, మరియు ఈ సత్యములను వివేచించుట బైబిలు వ్యాఖ్యానములో ఉన్నతమైన లక్ష్యము అయ్యున్నది.

విచారకరముగా, అనేకమంది క్రైస్తవ వేదాంతవేత్తలు ఈ అభిప్రాయమును హత్తుకున్నారు. మరియు వారు ఇలా చేయుచుండగా, భౌతిక లోకమును గూర్చి బైబిలు ఇచ్చు కథనముల నుండి తీవ్రమైన సమస్యలను ఎదుర్కొన్నారు. పాత నిబంధన ఇట్టి విషయముల మీద దృష్టిపెడుతుంది: విశ్వము యొక్క సృష్టి, దేవుని ప్రజల జీవితములలో భూలోక ఆశీర్వాదములు, ఐగుప్తు బానిసత్వము నుండి ఇశ్రాయేలు పొందిన భౌతిక విమోచన, మరియు వాగ్దాన దేశములో దేవుని ప్రజల కొరకు భూలోక రాజ్యము యొక్క స్థాపన. మరియు క్రొత్త నిబంధన యేసు జీవితములోని భౌతిక సన్నివేశములు మరియు అపొస్తలుల జీవితముల మీద దృష్టిపెడుతుంది. నియో-ప్లేటోవాదము ద్వారా ప్రభావితము చేయబడిన క్రైస్తవుల విషయములో, ఈ చరిత్రల యొక్క భౌతిక విషయములు సమస్యాత్మకముగా ఉన్నాయి, ఎందుకంటే అవి భౌతిక లోకమును దేవుని మంచి సృష్టిగా కనుపరచాయి. కాబట్టి, బైబిలుకు మరియు నియో-ప్లేటోవాద తత్వశాస్త్రమునకు మధ్య సంధి కుదుర్చుటకు రూపక వ్యాఖ్యాన విద్యాలయములను వారు ఉపయోగించారు. వారి వ్యాఖ్యానశాస్త్ర విధానములు బైబిలులో నమోదు చేయబడిన భౌతిక వాస్తవికతలను తృణీకరించి, అవి బోధించుటకు ఉద్దేశించబడిన లోతైన ఆత్మీయ సత్యములను వెదకమని క్రైస్తవులను ప్రోత్సహించాయి.

లేఖనము యొక్క ఆత్మీయ భావన అనేక విధములుగా విశదీకరించబడింది మరియు విభాగించబడింది. ఒక ప్రఖ్యాతిగాంచిన విధానమును క్వాడ్రిగా అని పిలుస్తారు — నాలుగు గుఱ్ఱములు లాగు రోమీయుల రథమునకు ల్యాటిన్ పదము. లేఖనములు నాలుగు విభిన్నమైన అర్థములను ఇచ్చునట్లు రూపొందించబడినవి అని సూచించుటకు క్వాడ్రిగా చిత్రము లేఖనమునకు అనువర్తించబడింది.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

క్రీ.శ. 360 నుండి 435 మధ్య కాలములో నివసించిన జాన్ కేసియన్, తన రచనయైన *కాన్ఫరెన్సెస్*, కాన్ఫరెన్స్ 14, అధ్యాయము 8లో ఈ విధానమును వివరముగా వర్ణించాడు. అక్షరార్థ మరియు ఆత్మీయ భావనల మధ్య ఓరిగన్ చేసిన మౌలిక వ్యత్యాసమును కేసియన్ అనుసరించాడు. అయితే మూడు రకముల ఆత్మీయ అర్థములను గుర్తించుట ద్వారా అతడు దీనిని దాటి వెళ్లాడు: రూపక భావన, ఇది వాక్యభాగము యొక్క సిద్ధాంతిక బోధ అయ్యున్నది; అలంకారిక భావన, ఇది వాక్యభాగము యొక్క నైతిక బోధ అయ్యున్నది; మరియు అర్థోన్నతీకరణ భావన, ఇది పరలోకము మరియు అంత్య దినముల రక్షణను గూర్చి వాక్యభాగము చేయు బోధ అయ్యున్నది.

ఉదాహరణకు, *క్వాడ్రిగా* ప్రకారం, ఒక బైబిలు భాగము "యెరూషలేము"ను ప్రస్తావించినప్పుడు, దీనిని నాలుగు విధములుగా అర్థము చేసుకోవచ్చు. అక్షరార్థ భావనలో ఇది ఇశ్రాయేలు యొక్క ప్రాచీన రాజధాని. రూపక భావనలో, ఇది సంఘమును గూర్చిన క్రైస్తవ సిద్ధాంతమును సూచిస్తుంది. అలంకారిక భావనలో, యెరూషలేము ఒక నమ్మకమైన విశ్వాసి అయ్యుండాలి లేక ఒక మానవ ఆత్మ యొక్క నైతిక గుణములు అయ్యుండాలి. మరియు అర్థోన్నతీకరణ భావనలో, ఇది ప్రకటన గ్రంథములో వర్ణించబడిన పరలోక పట్టణము అయ్యుండవచ్చు.

ఇప్పుడు, బైబిలు భాగము యొక్క ఆత్మీయ అర్థములను వాటి యొక్క అక్షరార్థ అర్థముతో ఎంత దగ్గరగా కలపాలి అను విషయమును గూర్చి బైబిలు వ్యాఖ్యానకర్తలు శతాబ్దములుగా వాదించారు అను విషయమును గుర్తించుట చాలా అవసరమైయున్నది. అన్ని అర్థములు ప్రాముఖ్యముగా అక్షరార్థముతో ముడిపడియున్నాయి అని కొందరు వాదించారు, అయితే వాక్యభాగము యొక్క ప్రతి భావన మరొకదాని మీద ఆధారపడకుండా స్వతంత్రముగా ఉన్నదని ఇతరులు చెప్పారు. మరియు అక్షరార్థ భావనతో ఎలాంటి అనుబంధము లేని మరుగుచేయబడిన ఆత్మీయ అర్థములను వారు వెలికితీయుటకు ప్రయత్నించారు.

ఒక ఉదాహరణగా, 1090 నుండి 1153 మధ్య కాలములో నివసించిన ప్రఖ్యాతిగాంచిన ఫ్రెంచ్ వేదాంతవేత్త అయిన క్లైర్వాక్స్ కు చెందిన బెర్నార్డ్, లేఖనము యొక్క ఆత్మీయ భావనలు దాని యొక్క అక్షరార్థ భావనతో దూరము చేసిన తీవ్రమైన ఊహాత్మక లేఖన వ్యాఖ్యానములను ప్రతిపాదించాడు. ఉదాహరణకు, పరమగీతమును అతడు వ్యాఖ్యానించిన విధానము వాక్యభాగము యొక్క అక్షరార్థ భావనతో ఎలాంటి పొంతనలేకుండా ఉన్నది.

పరమగీతము 1:16లో వ్రాయబడిన ఈ మాటలను వినండి:

> మన మందిరముల దూలములు దేవదారు మ్రానులు, మన వాసములు సరళపు మ్రానులు (పరమగీతము 1:16).

ఈ వాక్యభాగమును మనము చారిత్రిక నేపథ్యములో అధ్యయనము చేసినప్పుడు, ఇది సొలొమోను నిర్మించిన భవనమును వర్ణిస్తుంది అని చూచుట అంత కష్టమైన పని కాదు. రాజు యొక్క రాజరిక నివాసము వైపుకు దృష్టిని ఆకర్షిస్తూ ఇది రాజును కొనియాడుతుంది.

అయితే ఈ వచనము యొక్క అక్షరార్థ, వ్యాకరణ-చారిత్రిక భావన తన వ్యాఖ్యానమును నియంత్రించునట్లు క్లైర్వాక్స్ కు చెందిన బెర్నార్డ్ అనుమతించలేదు. అతని అభిప్రాయం ప్రకారం, ఈ వాక్యభాగము వాస్తవానికి చిహ్నాత్మక ఆత్మీయ అర్థములను సూచించింది. ఇక్కడ మందిరము స్వయంగా దేవుని ప్రజలను సూచించింది. మందిరములోని దూలములు మరియు వాసములు సంఘ అధికారులను సూచిస్తున్నాయి. అలాగే సంఘము మరియు రాజ్యము కలిసి ఎలా పనిచెయ్యాలో కూడా ఈ వచనము బోధిస్తుంది అని కూడా అతడు తెలిపాడు. ఈ వాక్యభాగములో బెర్నార్డ్ కనుగొనిన ఆత్మీయ అర్థములు దాని యొక్క అక్షరార్థ భావనలో నుండి వెలువడలేదు, లేక అవి దానితో పొంతన కలిగి కూడా లేవు.

> **మార్టిస్ లూథర్, ఆదికాండము మీద ఇచ్చిన ఉపన్యాసములలో, అతడు రూపక శైలి వ్యాఖ్యానమును గూర్చి మాట్లాడతాడు మరియు ఇక్కడ రూపకము అనగా రచయిత ఉద్దేశించిన రూపకము కాదుగాని, ఒక వాక్యభాగమును తీసుకొని రచయిత ఉద్దేశించని విధముగా దానిని రూపక రూపములో వ్యాఖ్యానించుట. మరియు తన యౌవ్వన కాలములో, బాల్యములో, అతడు చాలా చక్కగా ఇలా చేసేవాడని, తద్వారా అనేక ప్రశంసలు కూడా పొందుకునేవాడని లూథర్ చెప్పాడు. అయితే ఇది లేఖనముల పట్ల నమ్మకత్వము కాదు. కెల్విస్ కూడా రూపక వ్యాఖ్యానమును గూర్చి మాట్లాడుతూ అంటాడు, ఇది లేఖనము మీద మైనపు ముక్కును పెట్టుటను పోలియున్నది మరియు రచయితకు నమ్మకముగా ఉండుటకు బదులుగా వ్యాఖ్యానకర్తకు తోచిన విధముగా మీరు దానిని మార్చగలరు... అయితే, సంఘ పితరులను గూర్చి అధ్యయనం చేయుటలో కొంత విలువ ఉంది, లూథర్ నిశ్చయముగా వారి రచనలను చదివాడు, మరియు విమర్శించాడు కూడా. వారు నిజమైన సిద్ధాంతములను సరికాని విధములలో తీసుకొని వాటి గూర్చి బోధించని లేఖనభాగములకు వాటిని అనువర్తించినప్పటికీ, మనము వారి నుండి నేర్చుకోగలము, ఎందుకంటే వారు ఏమి చేయుటకు ప్రయత్నించుచున్నారో మనము అర్థము చేసుకోగలము. వారు పాత నిబంధనను వ్యాఖ్యానించి దానిని క్రైస్తవులకు ఔచిత్యముగా చేయు విధానమును అర్థము చేసుకొనుటకు ప్రయత్నించుచున్నారు, మరియు వారు కొన్ని సందర్భములలో దారితప్పిపోయారు అని మనము చెప్పవచ్చు. కాబట్టి వారు లేఖనమును వ్యాఖ్యానించిన విధానమును గూర్చి మనము నేర్చుకోవచ్చు. అలాగే సంఘ చరిత్రలో నమ్మకమైన వ్యాఖ్యాన ఉదాహరణలు ఉన్నాయి మరియు వాటి నుండి మనము నేర్చుకోగలము.**
>
> — డా. రాబర్ట్ ఎల్. ప్లమ్మర్



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

లేఖనములకు పలు అర్థములు ఉన్నాయి అను ఆలోచన సమకాలీన లోకములో కూడా విభిన్నమైన కారణముల వలన ప్రాముఖ్యతను సంతరించుకున్నది. పలు స్థాయిలలో సంభాషించుట కొరకు దేవుడు లేఖనమును రూపొందించాడు అని వాదించుటకు బదులుగా, బైబిలులో ఉన్న పలు అర్థములు భాషలో ఉన్న అస్పష్టతలలో నుండి వెలువడతాయని అనేకమంది ఆధునిక వ్యాఖ్యానకర్తలు నమ్ముతారు. భాష ఎంత అస్పష్టమైనది అంటే, దానికి ఒక ఖచ్చితమైన అర్థము ఏనాడు ఉండదు. ఈ కారణం చేత, బైబిలు భాగము యొక్క అర్థమును గూర్చి మనము కొన్ని అస్పష్టమైన పరిమితులను లేక హద్దులను మాత్రమే నిర్ణయించగలము. అయితే ఈ అభిప్రాయము ప్రకారం, బైబిలులో ఉన్న పలు అర్థములను సరిచూచుట సాధ్యము కాదు, కాబట్టి మనము వాటిని అంగీకరించాలి అంతే, ఎందుకంటే ఒక వ్యక్తి ఒక అర్థమును చూస్తాడు మరియు మరొక వ్యక్తి మరొక అర్థమును నిర్ధారిస్తాడు.

లేఖనము యొక్క అక్షరార్ధ భావన అనేక అర్థములలో ఒకటిగా ఉన్నదని అనేకమంది క్రైస్తవులు నమ్ముతారు అని మనము చూశాము కాబట్టి, అక్షరార్ధ భావన లేఖనము యొక్క ఏక అర్థమైయున్నది అను ఆలోచనను ఇప్పుడు పరిగణిద్దాము.

## ఏక అర్థము

1225 నుండి 1274 మధ్య కాలములో నివసించిన ప్రఖ్యాతిగాంచిన వేదాంతవేత్తయైన థామస్ అక్వినాస్ *క్వాడ్రిగా* పట్ల మరింత భాధ్యతాయుతమైన దృక్కోణమును ప్రతిపాదించాడు. అతనికి ముందువచ్చినవారు మరియు సమకాలీనులలో అనేకమందికి భిన్నముగా లేఖనము యొక్క అక్షరార్ధ భావన దానిలో ఉన్న ఇతర భావనలన్నిటికీ ఆధారమైయున్నది అని అతడు నొక్కి చెప్పాడు. ఉదాహరణకు, తాను వ్రాసిన *సుమ్మ థియోలాజిక*, 1వ భాగము, 1వ ప్రశ్న, 10వ వ్యాసములో, ప్రతి మాన్యమైన ఆత్మీయ వ్యాఖ్యానము లేఖనము యొక్క అక్షరార్ధ భావనలో నాటబడియుంటుంది అని అతడు నొక్కి చెప్పాడు. అలాగే విశ్వాసము కొరకు అవసరమైన ఏది కూడా లేఖనములో మరొకచోట అక్షరార్ధ భావనలో బోధింపబడకుండా ఆత్మీయ అర్థముగా తెలియజేయబడలేదు అని కూడా అతడు బోధించాడు. అతడు లేఖనములను వ్యాఖ్యానించుచుండగా అక్వినాస్ ఎల్లప్పుడూ ఈ నియమములను అనుసరించాడు అని పండితులు అందరు ఒప్పుకోరు. ఏది ఏమైనా, ఒక లేఖన భాగము యొక్క ప్రతి భావనను దాని యొక్క అక్షరార్ధ భావనతో జతపరచాలని అతడు నియమాత్మకముగా ఉద్ఘాటించాడు.

బైబిలులో అక్షరార్ధములో ఆత్మీయ అర్థములను కనుగొనుటకు అక్వినాస్ చేసిన కృషి మనలో చాలా మందికి ఇంగిత జ్ఞానముగా అనిపించవచ్చుగాని, అతని దృష్టికోణమును అందరు ఉపయోగించలేదు. మధ్య యుగముల సంఘములోని అనేక సిద్ధాంతములకు మద్దతునిచ్చుటకు వాక్యభాగముల యొక్క అక్షర అర్థముతో అనుబంధము లేకుండా ఉన్న ఆత్మీయ వ్యాఖ్యానములు ఉపయోగించబడినవి. మరియు బైబిలు యొక్క అక్షర అర్థముతో ఎలాంటి అనుబంధము లేని ఆత్మీయ అర్థములలోనికి దేవుడు వారికి ఒక విశేషమైన మెళకువను అనుగ్రహించాడు అని సంఘ అధికారులు చెప్పేవారు.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

అయితే పద్నాలుగు నుండి పదిహేడు శతాబ్దములలో ఐరోపాలో జరిగిన పునరుజ్జీవనోద్యమము లేఖన వ్యాఖ్యానములో ఒక నాటకీయమైన మార్పు కొరకు రంగమును సిద్ధపరచింది. క్లుప్తంగా, పునరుజ్జీవనోద్యమ పండితులు సాంప్రదాయిక సాహిత్యము, తత్వ, మరియు మతపరమైన గ్రంథములను వాటి వాస్తవిక భాషలలో చదువుట ఆరంభించారు. వారు ఇలా చేయుచుండగా, ఈ సాహిత్యముల యొక్క అక్షరార్థ, చారిత్రిక భావనను ఉద్ఘాటిస్తూ సంఘ అధికారమునకు వేరుగా వారు ఈ వాక్యభాగములను వ్యాఖ్యానించారు. మరియు ఈ పద్ధతిని లేఖనములకు ఉపయోగించుటకు ఎక్కువ కాలం పట్టలేదు. ఈ వ్యాఖ్యాన ప్రణాళిక అక్షరార్థ భావనను బైబిలు భాగముల యొక్క వాస్తవిక అర్థముతో పోల్చింది. మరియు అది అక్షరార్థ, వాస్తవిక అర్థము యొక్క కేంద్రతను మరియు అధికారమును ఉద్ఘాటించింది.

> అయితే, మధ్యయుగ సంఘములో, లేఖనములో దేవుని యొక్క సంపూర్ణ ఉద్దేశము నాలుగింతల దృష్టికోణము ద్వారా తెలుసుకోగలము అని అనేకమంది విశ్వాసులు ఉద్ఘాటించారు: అక్షరార్థ, నైతిక, అర్థోన్నతీకరణ, మరియు రూపక. కాబట్టి పదహారవ శతాబ్దపు సంస్కర్తలు — వీరిని ప్రొటెస్టెంట్లు అని పిలుస్తారు — వారు దీనిని తిరస్కరించారు, కొంత వరకు సిద్ధాంతికముగా తిరస్కరించారు, కాని ముఖ్యముగా దానిలో నుండి వెలువడిన వాటి వలన తిరస్కరించారు, అది సంఘ అధికారమునకు మద్దతునిస్తూ, లేఖనమును భ్రష్టము చేసిన, లేక లేఖనము యొక్క వాస్తవిక ఉద్దేశమును లేక రచయిత ఉద్దేశమును అస్పష్టము చేసిన సంఘ బోధనా పరంపర అయ్యున్నది.
>
> — డా. జేమ్స్ డి. స్మిత్ III

> *క్వాడ్రిగా*, లేక లేఖనము యొక్క నాలుగింతల భావనకు క్రైస్తవ సంఘములో సుదీర్ఘమైన, ప్రాచీన చరిత్ర మరియు పరంపర ఉన్నది... కాబట్టి, సంస్కరణ కాలములో సంస్కరణ పితరులను ఈ విషయములో కొందరు కాథలిక్ ప్రత్యర్థులు గద్దించారు, ఎందుకంటే లేఖనమునకు ఒకే భావన లేక అర్థము ఉన్నదని సంస్కర్తలు నొక్కి చెప్పారు. అయితే ప్రతిస్పందనగా, విలియం విట్టకర్ వంటి వారు, *క్వాడ్రిగాను*, అనగా లేఖనమునకు నాలుగు భావనలు ఉన్నాయి అను భావనను మేము తిరస్కరించుటలేదు అని చెప్పారు; లేఖనమునకు నాలుగు అర్థములు లేక భావనలు ఉన్నాయి అను ఆలోచనను మేము తిరస్కరించుచున్నాము. కేవలం ఒకటి మాత్రమే ఉన్నది, అది చారిత్రిక, అక్షరార్థ, వ్యాకరణ అర్థము. అయితే మిగిలిన మూడు సేకరణలు లేక నేడు మనము ఆలోచించునట్లు అనువర్తనములైయున్నవి. అవి ఆ ఒక్క భావనలో నాటబడియున్నవి అనునది ఇక్కడ ఆలోచన, కాని నేడు బైబిలు పాఠకులుగా ఆ ఒక్క భావన మనకు ఏ విధంగా అనువర్తించబడుతుందో తెలియజేయుటకు అవి

> **ఉపయోగపడతాయి. కాబట్టి, ఇది *క్వాడ్రిగా* యొక్క సంపూర్ణ తిరస్కరణ కాదుగాని, దాని యొక్క సంస్కరణ, దానిని సరి చేయుట అయ్యున్నది, కాబట్టి ఒక భావన ఉన్నది మరియు విశ్వాసము, నిరీక్షణ మరియు ప్రేమ వలె మూడు వరుసల అనువర్తనము ఉన్నది.**
>
> — డా. బ్రూస్ బౌగస్

పునరుజ్జీవనోద్యమ కాలములో, అక్వినాస్ ప్రతిపాదించిన ఆలోచనలను ప్రొటెస్టెంట్లు అభివృద్ధి చేయుట కొనసాగించారు. అయితే ఆత్మీయ అర్థములు లేఖనము యొక్క అక్షరార్థ అర్థములో నాటబడియున్నవి అని మాత్రం వారు వాదించలేదు. బదులుగా, ఒక రచయిత తన వాస్తవిక శ్రోతల కొరకు ఉద్దేశించిన ఆత్మీయ కోణములు అన్ని దాని యొక్క అక్షరార్థ భావనలో భాగమైయున్నవి అని వారు చెప్పారు. లేఖనము యొక్క అక్షరార్థ భావన, లేక వాస్తవిక అర్థము, ఏకమైయున్నది మరియు సంక్లిష్టమైయున్నది అని వారు నమ్మారు. పునరుజ్జీవనోద్యమ ప్రొటెస్టెంట్లు "అక్షరార్థ" అను పదము యొక్క భావనను విశాలపరిచారు అని, తద్వారా "లేఖనము"లో ఉన్న సాహిత్యము వ్యక్తపరచాలని కోరిన ఉద్దేశమంతా దానిలో చేర్చబడింది అని మనము చెప్పవచ్చు. ఫలితంగా, అల్రిచ్ జ్వీన్లి, మార్టిన్ లూథర్, జాన్ కెల్విన్ వంటి ప్రఖ్యాతిగాంచిన వ్యక్తులు అక్షరార్థ లేక వాస్తవిక అర్థములో ప్రతి బైబిలు భాగము బోధించు విషయములన్నీ ఉన్నాయని అనుకున్నారు. వారు అక్షరార్థ భావనను చారిత్రిక, సిద్ధాంతిక, నైతిక మరియు యుగాంత కోణములు గల ఒక సంక్లిష్టమైన అర్థముగా పరిగణించారు.

లేఖనము యొక్క అక్షరార్థ భావనను గూర్చి ప్రొటెస్టెంట్లు కలిగియున్న ఆలోచనను తొలచబడిన ఒక విలువైన రత్నముతో పోల్చుట సహాయకరముగా ఉంటుంది. లేఖనము యొక్క అక్షరార్థ భావనకు అనేక చిన్న చిన్న భావనలు తోడ్పాటునిచ్చునట్లే, తొలచబడిన విలువైన రత్నమునకు అనేక "కోణములు" లేక "ముఖములు" ఉంటాయి. చారిత్రిక సత్యములు, సిద్ధాంతములు, నైతిక బాధ్యతలు, రక్షణ మరియు యుగాంతశాస్త్రము వంటి వాటిని గూర్చి ఏదో ఒక విషయమును తెలియపరచుట కొరకు లేఖనములోని ప్రతి వాక్యభాగము ఉద్దేశించబడింది.

అంతేగాక, విలువైన రత్నములోని ప్రతికోణము విభిన్నమైన ఉపరితలమును కలిగియుండి మొత్తము యొక్క అందమునకు తోడ్పాటునిస్తుంది, మరియు వాటిలో ఏ ఒక్క కోణము కూడా సంపూర్ణమైన రత్నమునని వాదించలేదు. ఇదే విధముగా, బైబిలు భాగములలో కూడా అక్షరార్థ భావన యొక్క అర్థమునకు తోడ్పాటునిచ్చు పలు కోణములు ఉంటాయి, మరియు వీటిలో ఏ చిన్న విషయము కూడా సంపూర్ణ అక్షరార్థ భావనని వాదించలేదు.

సులువుగా చెబితే, లేఖనము యొక్క అర్థము పలు కోణములను కలిగియున్నది. ప్రతి వాక్యభాగము యొక్క అర్థములో అనేక చిన్న భాగములు లేక కోణములు ఉంటాయి మరియు అవి దాని యొక్క అక్షరార్థ భావన అని మనము పిలచు ఏక, ఐక్య అర్థమునకు తోడ్పాటునిస్తాయి.

> బైబిలు ఒక ఘనమైన పుస్తకమైయున్నది. అది ఒక లోతైన పుస్తకమైయున్నది. ఇది దేవుని మనస్సులో నుండి కలుగుతుంది, మరియు దేవుని మనస్సు చాలా విశాలమైనది అని, వ్యక్తపరచబడిన ఆలోచనలు చాలా విశాలమైనవి అని మరియు వాటికి అనేక కోణములు కలవని నేను చెప్పనవసరం లేదు... కాబట్టి వ్యాఖ్యానములను విశ్లేషించుట అనగా కేవలం ఒకసారి నిలిచి, మిమ్మును మీరు ఈ విధంగా ప్రశ్నించుట అయ్యున్నది, వాక్యభాగమును చదువుటకు ఈ కోణము సరియైనదేనా? ... కాబట్టి విషయములను అనేక కోణముల నుండి దాని యొక్క నేపథ్యములో చూస్తూ తగిన వికల్పములను గూర్చి మీరు ఆలోచన చేయాలి అంతే, మరియు ఆ అర్థము సంక్లిష్టమైనదిగా ఉండవచ్చు అను సాధ్యతను స్వీకరించుటకు సిద్ధముగా ఉండాలి. ఫలితంగా, ఒక వాక్యభాగములో ఆదిమ అవగాహనలు, నేను కలిగియున్న ఆరంభ అభిప్రాయము కంటే అనేక విషయములు ఉంటాయి కాబట్టి, వాక్యభాగమును మరొకరు చదువుట ద్వారా నేను నేర్చుకోగలను.
>
> — డా. డారెల్ ఎల్. బోక్

లేఖనములోని ప్రతి పెద్ద వాక్యభాగములో వేదాంతశాస్త్రము మరియు క్రైస్తవ జీవనము కొరకు అనేక విధములైన అంతర్భావములు ఉంటాయి. కాబట్టి, బైబిలు భాగములకు పలు అర్థములు ఉంటాయని సంఘ చరిత్రలో అనేకమంది ఎందుకు తలంచారు అను విషయమును మనము సులువుగా అర్థము చేసుకోవచ్చు. అయితే ఒక బైబిలు భాగమును గూర్చి మనము చెప్పు ప్రతి విషయము ప్రాచీన లోకము యొక్క చారిత్రిక నేపథ్యములోని వ్యాకరణముతో ముడిపడియుండున్నట్లు చూచుకొనుట లేఖనముల యొక్క గొప్పతనమును బాధ్యతాయుతముగా ఆశ్రయించుట అయ్యున్నది. మరియు మనము బైబిలును ఈ విధంగా ఆశ్రయించినట్లయితే, దేవుడు మరియు ఆయన ప్రేరేపించిన రచయితలు లేఖనము యొక్క వాస్తవిక శ్రోతలకు తెలియపరచిన సంక్లిష్టమైన అర్థమును కనుగొనుటకు మనము మరింత ఉత్తమమైన రీతిలో సిద్ధపడగలుగుతాము.

లేఖనములో అర్థము యొక్క సంక్లిష్టతను గూర్చిన మన సంభాషణలో ఇప్పటి వరకు, బైబిలు యొక్క అక్షరార్థ భావన యొక్క ప్రాముఖ్యతను మరియు పరిమితిని ప్రొటెస్టెంట్లు ఎందుకు బలముగా ఉద్ఘాటిస్తారో మనము చూశాము. కాబట్టి ఇప్పుడు, లేఖన భాగముల యొక్క సంపూర్ణ విలువ అని మనము పిలచుదాని వైపుకు మన దృష్టిని మళ్లించుదాము.

# సంపూర్ణ విలువ

పలు సందర్భాలలో, ఇవాంజెలికల్ క్రైస్తవులు సెన్సస్ *ప్లేనియోర్* అను వ్యక్తీకరణను ఉపయోగిస్తారు, లేఖనము యొక్క "సంపూర్ణ భావన" అని దీని అర్థము. ఒక బైబిలు భాగము యొక్క అక్షరార్థ భావన లేక వాస్తవిక అర్థము యొక్క ప్రాముఖ్యతను మనము ఉద్ఘాటించుచుండగా, కేవలం అక్షరార్థ లేక వాస్తవిక భావనను పునరావృతం మాత్రమే చేయకుండా బైబిలులోని తరువాత భాగములు లేఖనములలోని మునుపటి భాగములను సూచిస్తాయి అని కూడా మనము గ్రహిస్తాము. క్రొత్త నిబంధన రచయితలు క్రీస్తులో పాత నిబంధన నెరవేర్చబడిన విధానమును గూర్చి తెలుపు విధానములో ఇది మరింత స్పష్టముగా కనిపిస్తుంది. క్రొత్త నిబంధన రచయితలు పాత నిబంధన వాక్యభాగములను సరిగా వ్యాఖ్యానించారు. వారు ఎన్నడు వాటి వాస్తవిక అర్థమునకు వ్యతిరేకముగా వెళ్లలేదు. అయితే వారు కేవలం వాస్తవిక అర్థమునకు మాత్రమే తమను తాము పరిమితము చేసుకోలేదు. బదులుగా, ఈ పాత నిబంధన వాక్యభాగముల యొక్క సంపూర్ణ భావనను, సెన్సస్ *ప్లేనియోర్* ను, కూడా వివేచించారు. కాబట్టి, ఈ విధానమును అనుసరించి, ప్రతి బైబిలు వాక్యభాగము యొక్క "సంపూర్ణ భావన" లేక "సంపూర్ణ విలువ"ను గూర్చి మనము మాట్లాడదాము.

ఈ పాఠ్యక్రమములో, ఒక బైబిలు భాగము యొక్క సంపూర్ణ అర్థమును మనము ఈ విధంగా నిర్వచిద్దాము:

> **ఒక వాక్యభాగము యొక్క సంపూర్ణ ప్రాధాన్యతలో, దాని వాస్తవిక అర్థము, దానిలో ఉన్న బైబిలు ఉల్లేఖనములు అన్నీ, మరియు దానిలోని సరియైన అనువర్తనములన్నీ భాగమైయుంటాయి.**

వాస్తవిక అర్థము లేఖనము యొక్క అక్షరార్థ భావన అయ్యున్నది, మరియు ఇది ఒక వాక్యభాగము యొక్క అత్యంత మౌలికమైన కోణమైయున్నది. బైబిలు ఉల్లేఖనములు అనగా, లేఖనములోని ఒక భాగము ప్రత్యక్షంగా లేక పరోక్షంగా లేఖనములోని మరియొక భాగమును వ్యాఖ్యానించుట అయ్యున్నది. మరియు సరియైన అనువర్తనములు అనగా, లేఖనము దాని పాఠకుల యొక్క జీవితముల కొరకు కలిగియున్న అంతర్భావములు అయ్యున్నవి.

బైబిలు యొక్క సంపూర్ణ విలువను గూర్చిన ఈ నిర్వచనమునకు అనుగుణంగా, మన సంభాషణ మూడు భాగములుగా విభాగించబడుతుంది. మొదటిగా, మనము వాస్తవిక అర్థము మీద దృష్టిపెడదాము. రెండవదిగా, మనము బైబిలు ఉల్లేఖనములను చూద్దాము. మరియు మూడవదిగా, మన జీవితములకు లేఖనము యొక్క సరియైన అనువర్తనములను విశదీకరిద్దాము. మనము వాస్తవిక అర్థముతో ఆరంభిద్దాము.

## వాస్తవిక అర్థము

మునుపటి పాఠంలో, వాస్తవిక అర్థమును మనము ఈ విధంగా నిర్వచించాము:

> **లేఖనము దాని యొక్క మొదటి శ్రోతలకు తెలియజేయాలని దాని దైవిక మరియు మానవ రచయితలు ఉద్దేశించిన భావనలు, ప్రవర్తనలు మరియు భావోద్వేగాలు.**

మనము ఇంతకు ముందు చెప్పినట్లుగా, ఒక వాక్యభాగము యొక్క వాస్తవిక అర్థము దాని అక్షరార్థ భావనకు సమానమైయున్నది. మరియు ఈ నిర్వచనము చూపుచున్నట్లు, వాస్తవిక అర్థములో పలు కోణములు ఉంటాయి. లేఖనము దాని యొక్క మొదటి శ్రోతలతో అనేక స్థాయిలలో సంభాషించవలసియున్నది. అది భావనలను, అనగా వాక్యభాగములో వాస్తవిక శ్రోతలు గుర్తించబడవలసియుండిన ఆలోచనలను తెలియపరుస్తుంది. అది ప్రవర్తనలను, అనగా వాక్యభాగములో చేసిన లేక చేయని కార్యములను తెలియపరుస్తుంది. మరియు అది భావోద్వేగములను, అనగా వాక్యభాగములో వ్యక్తపరచబడిన వైఖరులు లేక భావోద్వేగములను తెలియపరుస్తుంది.

ఒక వాక్యభాగము భావనలను, ప్రవర్తనలను, మరియు భావోద్వేగములను ఎలా తెలియజేస్తుందో చూచుటకు నిర్గమ. 20:13ను పరిశీలిద్దాము:

> **నరహత్య చేయకూడదు (నిర్గమ. 20:13).**

వాస్తవిక అర్థమునకు మనమిచ్చిన నిర్వచనము దృష్ట్యా ఈ వాక్యభాగమును గూర్చి ఆలోచన చేద్దాము. హత్యను గూర్చి ఇవ్వబడిన ఆజ్ఞ ద్వారా దైవిక మరియు మానవ రచయితలు తమ మొదటి శ్రోతలకు ఏ విధమైన భావనలను, ప్రవర్తనలను, మరియు భావోద్వేగములను తెలియపరచాలనుకున్నారు? అయితే, భావనల విషయములో, కీడు చేయ తలంచి ఒక మానవుని ప్రాణమును తీయుటను ఈ వచనము స్పష్టముగా వ్యక్తపరుస్తుంది. అంతర్భావముగా, మానవ జీవితము దేవుని దృష్టికి విలువైనది అని ఇది తెలియజేస్తుంది. మరియు ఇది ఒక ఆజ్ఞ రూపమును తీసుకుంటుంది అను వాస్తవము దేవుడు మానవుల మీద సార్వాభౌమునిగా ఉన్నాడు అని సూచిస్తుంది.

ప్రవర్తనల విషయములో, ఈ ఆజ్ఞ దేవుని చారిత్రిక కార్యముల యొక్క నివేదికలో భాగమైయున్నది — ఈ ఆజ్ఞను మోషేకు అందించు ప్రవర్తనలో దేవుడు స్వయంగా పాలుపంచుకున్నాడు, మరియు మోషే దీనిని దేవుని ప్రజలకు అందించాడు. మరియు మోషే అరణ్యములో గుండా వాగ్దాన దేశములోనికి నడిపించిన ప్రజలు — నిర్గమకాండము యొక్క వాస్తవిక శ్రోతలు — హత్య చేయు ప్రవర్తనను కలిగియుండకూడదు అని ఇది సూచిస్తుంది.

భావోద్వేగముల విషయములో, దేవుడు హత్యను ద్వేషిస్తాడు అని, మరియు ఆయన న్యాయము జరిగించాలను నిర్ధారణ కలిగియున్నాడు అని ఈ వాక్యభాగము బోధిస్తుంది.

హత్యకు విరోధముగా ఇవ్వబడిన ఆజ్ఞ యొక్క వాస్తవిక అర్థములో పలు కోణములు ఉన్నాయి, మరియు వాస్తవిక శ్రోతలకు దేవుని యొక్క మరియు మోషే యొక్క స్పష్టమైన భావనలు, ప్రవర్తనలు మరియు భావోద్వేగములను తెలియజేయుటకు, మరియు వారి భావనలు, ప్రవర్తనలు, మరియు భావోద్వేగాల విషయములో దేవుడు వారి యొద్ద నుండి కోరు విషయములను తెలియజేయుటకు ఉద్దేశించబడినవి. ప్రతి బైబిలు భాగము విషయములో ఇదే వాస్తవమైయున్నది.

ఫలితంగా, ఒక వాక్యభాగము యొక్క సంపూర్ణ విలువను మనము పొందుకోవాలని ఆశిస్తే, మనము వాస్తవిక అర్థము యొక్క సంక్లిష్టతలను మెచ్చుకోవాలి. ఈ సంక్లిష్టతలను మనము తిరస్కరిస్తే, లేఖనము మనకు బోధించాలని కోరుచున్న అనేక విషయములను మనము తప్పిపోతాము.

> వాక్యభాగమును వ్యాఖ్యానించుటకు సంస్కర్తలు రెండు పద్ధతులను అభివృద్ధి చేశారు: వ్యాకరణ మరియు చారిత్రిక. ఒక వైపున, వ్యాకరణ ఆధారంగా వాక్యభాగము ఏమి బోధిస్తుంది? మరొక వైపు, మొదటి సందర్భములో అది ఏమి తెలిపింది? ఈ రెండు ప్రశ్నల జవాబులు పరిమితులను అందిస్తాయి. ఆ పరిమితులలో, విభిన్నమైన వ్యాఖ్యానములు అర్థమైనవి మరియు మాన్యమైనవి, అనగా ఆ పరిమితులలో అవును, ఈ వాక్యభాగమును వేరొక విధముగా కూడా అర్థము చేసుకోవచ్చు అని ఒప్పుకొను తగ్గింపును మనము కలిగియుండాలి. ఇప్పుడు, ఆ వ్యాఖ్యానములలో ఒకటి వ్యాకరణముగా అసాధ్యమైనది, అది తప్పు అని మనము చెప్పవచ్చు. లేక ఒకటి చారిత్రికముగా అసాధ్యమైతే — అనగా ఆ నేపథ్యములో వాక్య అర్థము అది కాకపోతే — దానిని మనము తిరస్కరించవచ్చు. అయితే ఆ రెండు పరిమితుల మధ్య, విభిన్నమైన వ్యాఖ్యానములు సాధ్యమే, మరియు నేను చెప్పునట్లు, మన సొంత అవగాహన విషయములో మనము తగ్గింపు కలిగియుండాలి.
>
> — డా. జాన్ ఒస్వల్ట్

> లేఖనమును ఒకటి కంటే ఎక్కువ మార్గములలో అర్థమైన విధముగా చదవవచ్చు. ఇప్పుడు, ఎలా అనువదించినా సరిపోతుంది అని దీని అర్థము కాదు. కొన్ని విషయములను స్పష్టముగా తిరస్కరించాలి. ఉదాహరణకు, మరొకసారి ఇక్కడ విశ్వాస సూత్రములలో ఇవ్వబడిన ముఖ్యమైన నియమములు సహాయకరముగా ఉంటాయి. విశ్వాస నియమము మనలను లేఖనమును తప్పుగా అర్థము చేసుకోకుండా నివారిస్తుంది... మరొక బైబిలు వ్యాఖ్యానకర్తతో మనము అహంకారముగాను, సిద్ధాంతిక ఆత్మతోను సంభాషించుటకు ప్రయత్నిస్తే, అది ప్రాథమికముగా తప్పు అవుతుంది.
>
> — డా. కేరీ విన్జంట్

వాస్తవిక అర్థము లేఖనము యొక్క సంపూర్ణ విలువకు ఏ విధంగా తోడ్పడుతుందో చూశాము కాబట్టి, ఇప్పుడు మన దృష్టిని బైబిలు ఉల్లేఖనముల మీదికి మళ్లించుదాము.

## బైబిలు ఉల్లేఖనములు

బైబిలు ఉల్లేఖనములు అనగా:

> లేఖనములోని ఒక భాగము లేఖనములోని మరొక భాగము యొక్క అర్థములోని ఒక కోణమును ప్రత్యక్షముగా లేక పరోక్షముగా వ్యాఖ్యానించు స్థలములు.

లేఖనమంతా ప్రేరేపితమైనది మరియు పొరపాటులేనిది కాబట్టి, ఈ ఉల్లేఖనములు వాస్తవిక అర్థముతో సమ్మతిస్తాయి లేక నిర్ధారిస్తాయి. కొన్నిసార్లు, ఉల్లేఖనము అనగా వాస్తవిక అర్థములోని ఒక కోణమును పునరావృతము చేయునట్లు చెప్పుట అయ్యున్నది. మరికొన్నిసార్లు, బైబిలు ఉల్లేఖనము అనగా స్పష్టముగా లేని లేక సరిగా అర్థము చేసుకొనలేని విషయములను స్పష్టము చేయుట అని చెప్పవచ్చు. ఇంకొన్నిసార్లు, బైబిలు ఉల్లేఖనము ఒక వాక్యభాగ అర్థము యొక్క విస్తరణ కూడా అయ్యుంటుంది.

ఉదాహరణకు, హత్యకు విరోధముగా ఇవ్వబడిన ఆజ్ఞను అనేక చోట్ల బైబిలు విస్తారముగా వివరిస్తుంది. ఈ ఆజ్ఞ మొట్టమొదటిసారిగా నిర్గమ. 20:13లో నివేదించబడింది, అక్కడ ఇలా వ్రాయబడియున్నది:

> నరహత్య చేయకూడదు (నిర్గమ. 20:13).

మనము ప్రస్తావించబోవు ఈ వాక్యభాగము యొక్క మొదటి బైబిలు ఉల్లేఖనము ప్రధానముగా ద్వితీ. 5లో ఈ మాటల యొక్క ఖచ్చితమైన పునరావృతమైయున్నది, అక్కడ మోషే పది ఆజ్ఞలలో ఉన్న విషయములను ఇశ్రాయేలు దేశమునకు జ్ఞాపకము చేశాడు. ద్వితీ. 5:17లో లేఖనము మరొకసారి ఇలా సెలవిస్తుంది:

> నరహత్య చేయకూడదు (ద్వితీ. 5:17).

ఈ పునరావృతము ఆజ్ఞను నిర్ధారించింది మరియు ఆయన నిబంధనలోని షరతులను దేవుని ప్రజలకు జ్ఞాపకము చేసింది. అవును, ఉల్లేఖనము పునరావృత రూపములో ఉల్లేఖించబడినప్పుడు కూడా, అది కేవలం మునుపు తెలుపబడిన మాటలను పునరావృతము మాత్రమే చేయదు — ఉల్లేఖనము యొక్క నేపథ్యము ఎల్లప్పుడూ దాని యొక్క అర్థమునకు మరింత చేర్చుతుంది. అయినను, కొన్ని ఉల్లేఖనములు రూపములో పునరావృతములైయున్నవి అని గుర్తించుట సహాయకరముగా ఉంటుంది.

మనము తెలుపు రెండవ రకమైన ఉల్లేఖనము స్పష్టత ఇచ్చుట అయ్యున్నది, మరియు హత్యకు విరోధముగా ఇవ్వబడిన ఆజ్ఞకు స్పష్టతను మనము సంఖ్యా. 35లో చూస్తాము. ఆ అధ్యాయములో, మోషే

హత్య మరియు పొరపాటున చంపుట మధ్య వ్యత్యాసమును తెలియపరచాడు. ఆది. 35:20-25లో మోషే వ్రాసిన మాటలను వినండి:

> ఒకడు చచ్చునట్లు వాని పగపెట్టి పొడిచినను, లేక పొంచియుండి వానిమీద దేనినైనను వేసినను, లేక ఒకడు చచ్చునట్లు పైరమువలన చేతితో వాని కొట్టినను, కొట్టినవాడు నరహంతకుడు, నిశ్చయముగా వాని చంపవలెను... అయితే పగపట్టక హఠాత్తుగా వానిని పొడిచినను, పొంచియుండక వానిమీద ఏ ఆయుధమునైన వేసినను, వాని చూడక ఒకడు చచ్చునట్లు వానిమీద రాయి పడవేసినను, దెబ్బతినినవాడు చనిపోయినయెడల ... సమాజము ... ఆ నరహంతకుని విడిపింపవలెను (సంఖ్యా. 35:20-25).

హత్యకు విరోధముగా ఇవ్వబడిన ఆజ్ఞను అర్థము చేసుకొనుటకు ఈ స్పష్టత కీలకమైన సమాచారమును అందిస్తుంది. మానవుని చంపిన ప్రతి సందర్భము హత్య అవ్వదు అని ఇది స్పష్టము చేస్తుంది, మరియు దుర్ఘటనలకు హత్యకు విధించబడు శిక్షను విధించకూడదు అని ఇది స్పష్టము చేస్తుంది. ఒక వ్యక్తిని "పగబట్టి చంపినప్పుడు," అనగా దుష్టత్వముతో పూనుకొని ఉద్దేశపూర్వకముగా హత్య చేయబడినప్పుడు, ఆజ్ఞ మరింత కఠినమైన శిక్షను ప్రతిపాదిస్తుంది. అయితే అనుకోకుండా ఒక వ్యక్తిని చంపినప్పుడు, ఆ చంపిన వ్యక్తి హత్య చేసినట్లు ఆజ్ఞ పరిగణించదు.

మనము తెలుపు మూడవ బైబిలు ఉల్లేఖనము విస్తరణ అయ్యున్నది, దీనిలో లేఖనము ఒక వాక్యభాగము లేక అంశమును గూర్చి అదనపు సమాచారమును అందిస్తుంది. హత్యకు విరోధముగా ఇవ్వబడిన ఆజ్ఞకు విస్తరణను మనము మత్తయి 5లో చూస్తాము, అక్కడ యేసు ఆజ్ఞ యొక్క పరిమితిని సంకుచితము చేసినందుకు ఆ దిన బోధకులను విమర్శిస్తున్నాడు. మత్తయి 5:21-22లో హత్యకు విరోధముగా ఇవ్వబడిన ఆజ్ఞను గూర్చి యేసు ఏమి బోధించుచున్నాడో వినండి:

> నరహత్య చేయవద్దు; నరహత్య చేయువాడు విమర్శకు లోనగునని పూర్వికులతో చెప్పబడిన మాట మీరు విన్నారు గదా. నేను మీతో చెప్పునదేమనగా తన సహోదరుని మీద కోపపడు ప్రతివాడు విమర్శకు లోనగును (మత్తయి 5:21-22).

ఇక్కడ, ఒక మానవుని జీవితమును నియమమునకు విరోధముగా భౌతిక హాని ద్వారా తీయుటను మించి యేసు హత్యకు విరోధముగా ఇవ్వబడిన ఈ ఆజ్ఞను అనువర్తించుచున్నాడు. యేసు ఇచ్చిన విస్తరణ ప్రకారం, దుర్నీతితో కూడిన కోపము కూడా హత్య ఉల్లంఘించు నియమమునే ఉల్లంఘిస్తుంది. కోపము హత్య అంత చెడ్డది కాదు, కాని అది దేవుని స్వభావములోని అదే కోణమును ఉల్లంఘిస్తుంది.

> అవును, కొండ మీద ప్రసంగములో యేసు అనేక ఆజ్ఞలను ఉపయోగిస్తాడు, వాటిలో ఒకటి, "నరహత్య చేయవద్దు అని చెప్పబడిన మాట మీరు విన్నారు గదా." తరువాత



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

ఆయన అంటాడు, "నేను మీతో చెప్పునదేమనగా తన సహోదరుని మీద కోపపడు ప్రతివాడు విమర్శకు లోనగును. అది సమస్య." కాబట్టి, యేసు కొండ మీద చేసిన ప్రసంగమును చదువుట ఆజ్ఞల యొక్క నిజమైన అర్థమును గ్రహించుటకు చాలా ప్రాముఖ్యమైయున్నది అని నా ఆలోచన, ఎందుకంటే యేసు చేస్తున్న పని అదే… ఆయన విషయము యొక్క మూలమును తెలియజేయుచున్నాడు. యేసు మనకు ఏమి చూపుచున్నాడు అంటే — మరియు యేసు చెప్పుచున్న దానిని మనము అనువర్తించాలని నేననుకుంటాను — హత్యను గూర్చిన ఆజ్ఞ, నేను హత్య చేయలేదు కాబట్టి నేను మంచి వ్యక్తిని అను విషయమునకు సంబంధించినది కాదు; నేను ఆజ్ఞను పాటించాను. యేసు ఇలా చెబుతున్నాడు … ఇది హృదయములో హత్య చేయు ఆలోచన తలెత్తుటకు సంబంధించినది, మరియు దానినే ద్వేషం అని అంటారు.

— డా. బ్రియన్ జే. విక్కర్స్

నిర్గమకాండము వెనుక ఉన్న నియమములలోనికి వెళ్లమని యేసు ఆహ్వానించుచున్నాడు, మరియు పాపము చేయకపోవుట సరిపోదుగాని, పాపము చేయాలనే తలంపు కూడా ఉండకూడదు అని ఆయన చెబుతున్నాడు. అనగా, యేసు కేవలం మన ప్రవర్తనను గూర్చి మాత్రమేగాక మన స్వభావమును గూర్చి, మనము చేయు క్రియలు మాత్రమే గాక మనము ఏమైయున్నాము అను విషయమునుగూర్చి కూడా మాట్లాడుచున్నాడు. కాబట్టి ఆయన అంటాడు, "నరహత్య చేయవద్దు అని చెప్పబడిన మాట మీరు విన్నారు గదా." మీకు హత్య చెయ్యాలనే ఆలోచన కూడా రాకూడదు అని యేసు చెబుతున్నాడు… కాబట్టి ఆయన హృదయ ధర్మశాస్త్రము వైపుకు చూస్తున్నాడు. ఆయన ఒక నియమము కొరకు చూస్తున్నాడు, మరియు ఆ నియమము అన్ని సంస్కృతులకు వర్తిస్తుంది మరియు దేవుడు కోరు వాటిని కోరునట్లు మనలను ఆహ్వానిస్తుంది, మరియు దేవుని కృప ద్వారా మన హృదయములు మార్పు చెందినప్పుడు మనలో కార్యము చేయుచున్న ఆయన రాజ్య బలము ద్వారా మనము అలా మాత్రమే చేయగలుగుతాము.

— డా. క్రైగ్ ఎస్. కీనర్

యేసు మరియు ఇతర బోధకులు లేఖనమును ప్రస్తావించినప్పుడు, వారు సాధారణంగా "వ్రాయబడియున్న" విషయములను గూర్చి మాట్లాడారు. అయితే మత్తయి 5:21-22లో, యేసు "వ్రాయబడియున్న" విషయమును గూర్చి గాక చెప్పబడిన విషయమును గూర్చి మాట్లాడాడు. వ్రాయబడిన

విషయములను గూర్చి యూదా బోధకులు చెప్పిన విషయములను సంబోధించుటకు ఇది ఒక సామాన్య విధానమైయున్నది. పాత నిబంధనను సవాలు చేయుటగాక, పాత నిబంధన యొక్క వాస్తవిక అర్థము నుండి తప్పిపోయిన ప్రఖ్యాతిగాంచిన పాత నిబంధన వ్యాఖ్యానములను యేసు ఖండించుచున్నాడు.

ఈ విస్తరణ ఆజ్ఞ యొక్క వాస్తవిక అర్థమునకు విస్తరణ అయ్యున్నది, ఎందుకంటే అది కేవలం వివరణను మాత్రమే ఇవ్వలేదు. అది కేవలం ఆజ్ఞ యొక్క పదముల అర్థమును వివరించుటకు మాత్రమే ప్రయత్నించలేదు. బదులుగా, దేవుని ప్రత్యక్షత యొక్క విస్తృత నేపథ్యములో ఆజ్ఞ యొక్క వాస్తవిక ఉద్దేశమును బయలుపరచు విధానములలో ఆజ్ఞకు సహకరించు విధముగా ఇతర వాక్యభాగములలోని అదనపు సమాచారమును చేర్చింది. ఈ నేపథ్యములో, హత్యను గూర్చి ఇవ్వబడిన ఆజ్ఞ మానవాళి కొరకు దేవుడు కలిగియున్న శ్రద్ధను బయలుపరచుటకు ఎల్లప్పుడూ ఉద్దేశించబడింది అని, దాని యొక్క వాస్తవిక అంతర్భావములు కేవలం హత్యను నిరోధించుటను దాటి వెళ్లాయని యేసు తెలియపరచాడు.

> అవును, దేవుడు నిర్గమకాండములో హత్యను నిషేధించుచున్నాడు, మరియు కొండ మీద ప్రసంగములో యేసు ఆ ఆజ్ఞను గూర్చి మాట్లాడినప్పుడు, అది "హృదయ పాపములు" అని మనము పిలచు క్రోధము మరియు కోపమును హత్తుకొంటుంది అని చెబుతూ ఆయన కొనసాగించాడు. ఇప్పుడు అక్కడ జరుగుతున్న విషయములను వివరించుటకు అనేక మార్గములు ఉన్నాయి. ఆ వాస్తవిక ఆజ్ఞతో యేసు ఏమి చేస్తున్నాడు? ఆయన దానిని ప్రక్కనబెట్టి ఒక క్రొత్త ఆజ్ఞను పరిచయం చేస్తున్నాడు అని కొందరు అన్నారు. నిర్గమకాండములో ఇవ్వబడిన ఆజ్ఞ బాహ్య సంబంధమైనది అయ్యుండగా, ఇప్పుడు యేసు వచ్చి ఒక క్రొత్త విషయమును చేర్చుచున్నాడు, ఆ నిర్గమకాండ ఆజ్ఞలో కనిపించని మరియు లేని ఒక ఆజ్ఞను చేర్చుచున్నాడు, మరియు ఆయన ధర్మశాస్త్రమును అంతర్గతం చేస్తున్నాడు. యేసు ఒక క్రొత్త విషయమును చెప్పుట లేదుగాని, ఆ ఆజ్ఞలో అంతకు ముందే ఉన్నదానిని ఆయన వెలికితీయుచున్నాడు అని చెప్పుట సమంజసమవుతుంది అని నా ఆలోచన. ఉదాహరణకు, పది ఆజ్ఞలలో పదియవ ఆజ్ఞయైన "నీ పొరుగువాని యిల్లు ఆశింపకూడదు" అను ఆజ్ఞలో ఇది స్పష్టమవుతుంది. ఈ ఆజ్ఞ హృదయమును మరియు హృదయ పాపములను ఉద్దేశించి మాట్లాడుతుంది. మరియు అది పది ఆజ్ఞలన్నిటికీ కీలకమైనదిగా ఇవ్వబడినది అని నా ఆలోచన, మరియు పది ఆజ్ఞలలోని ఆజ్ఞలు బాహ్య ప్రవర్తనలను గూర్చి మాత్రమే మాట్లాడుతున్నాయని మనము అనుకొనకూడదుగాని, ఆ ప్రవర్తనలకు క్రింద ఉన్న హృదయ కార్యములు, హృదయ పాపములు, హృదయ వైఖరులను గూర్చి కూడా మాట్లాడుతున్నాయి. కాబట్టి కొండ మీద ప్రసంగములో యేసు ఏమి చేయుచున్నాడంటే, ఆయన ధర్మశాస్త్రమును పునరుద్ధరించుచున్నాడు మరియు దానిని సంపూర్ణ తీవ్రతలో వెలికి తీయుచున్నాడు,

> మరియు చరిత్రలో, అనగా దేవుని ప్రజల జీవితములలో ఆ ఆజ్ఞలు చదివిన చరిత్ర కాలములో ధర్మశాస్త్రములోనికి చొచ్చుకొనిపోయిన భ్రష్టత్వములను తొలగించుచున్నాడు. కాబట్టి యేసు నిలువబడి, మనకు ధర్మశాస్త్రము యొక్క నిజమైన ఉద్దేశమును ఇస్తూ, ధర్మశాస్త్రమును దాని యొక్క పూర్ణతలో చూపుచున్నాడు.
>
> — డా. గై వాటర్స్

మనము లేఖనములను ఎంత ఎక్కువగా అధ్యయనం చేస్తే, బైబిలు దానిలోని విషయములను మరలా మరలా ఉల్లేఖిస్తుంది అని అంత ఎక్కువగా మనము చూడగలుగుతాము. ప్రవక్తలు మరియు కీర్తనకారులు మరలా మరలా మోషే ధర్మశాస్త్రమును ప్రస్తావిస్తారు. యేసు కూడా తరచుగా పాత నిబంధనను ఉపయోగించాడు. క్రొత్త నిబంధన రచయితలు కూడా చాలాసార్లు ఈ విధంగా చేశారు. కొన్నిసార్లు, బైబిలు రచయితలు తమ నిర్ధారణలకు ఏ విధంగా వచ్చారు అని అర్థము చేసుకొనుట మనకు కష్టమవుతుంది. అయితే ప్రతి సందర్భములోను, వాటి యొక్క వాస్తవిక అర్థమును పునరావృతం చేయుట ద్వారా, స్పష్టము చేయుట ద్వారా మరియు విస్తరింపజేయుట ద్వారా బైబిలు ఉల్లేఖనములు బైబిలులోని ఇతర భాగములను నిర్ధారిస్తాయి. మరియు అవి దీనిని పరిశుద్ధాత్మ యొక్క ప్రేరణలో చేశాయి. ఈ కారణం చేత, లేఖనముల యొక్క అర్థమును మనము విశదీకరించుచుండగా, లేఖనములు వాటిని అవి ఉల్లేఖించు స్థలములన్నిటిని గుర్తించి, వాటికి మనలను మనము సమర్పించుకోవాలి.

లేఖనము యొక్క సంపూర్ణ విలువను గూర్చి మనము చేయుచున్న చర్చలో ఇప్పటి వరకు, మనము వాస్తవిక అర్థమును మరియు బైబిలు ఉల్లేఖనములను చూశాము. కాబట్టి, ఇప్పుడు ఒక బైబిలు భాగములో నుండి మనము వెలికితీయగల సరియైన అనువర్తనముల మీద దృష్టిపెట్టుటకు సిద్ధముగా ఉన్నాము.

## సరియైన అనువర్తనములు

సరియైన అనువర్తనములను మనము ఈ విధంగా నిర్వచించుదాము:

> ఒక లేఖన భాగము యొక్క వాస్తవిక అర్థము మరియు బైబిలు ఉల్లేఖనములు ఆ లేఖన భాగము యొక్క శ్రోతల మీద కలిగియుండవలసిన భావనాత్మక, ప్రవర్తన మరియు భావోద్వేగ ప్రభావములు

వాస్తవిక అర్థము మరియు బైబిలు ఉల్లేఖనములు ప్రేరేపితమైనవి మరియు ప్రతి యుగములోని విశ్వాసులందరి మీద సంపూర్ణ అధికారమును కలిగియుంటాయి. ఇందుమూలముగానే లేఖనము యొక్క

సరియైన అనువర్తనములన్నీ బైబిలు యొక్క వాస్తవిక అర్థము మరియు ఉల్లేఖనములలో నుండి వెలువడాలి మరియు వాటికి అనుగుణంగా ఉండాలి. అయితే మన అనువర్తనములు దేవుని ద్వారా ప్రేరేపించబడినవి కావు. మనము తప్పిదములను చేస్తాము, మరియు మన అనువర్తనములు మార్పుచెందదగినవి మరియు అభివృద్ధిపొందదగినవి. అయినను, మన అనువర్తనములు లేఖనమునకు అనుగుణంగా ఉన్నంత వరకు, అవి దేవుడు ఉద్దేశించిన బైబిలు ఉపయోగములో భాగమైయుంటాయి, కాబట్టి బైబిలు యొక్క సంపూర్ణ విలువలో భాగమైయుంటాయి.

బైబిలు సిద్ధాంతము యొక్క ప్రఖ్యాతిగాంచిన ప్రొటెస్టెంట్ సారాంశమైన 1689కి చెందిన *లండన్ బాప్టిస్ట్ కన్ఫెషన్ ఆఫ్ ఫెయిత్*, 1వ అధ్యాయము, 10వ భాగములో ఈ ఆలోచన వ్యక్తపరచబడింది:

> మతము యొక్క వివాదములన్ని నిర్థారించబడగల, మరియు సభల యొక్క శాసనములన్ని, పురాతన రచయితల యొక్క అభిప్రాయములు, పురుషుల సిద్ధాంతములు, మరియు రహస్య ఆత్మలు పరీక్షించబడగల, మరియు మనము ఆధారపడగల తీర్పులనిచ్చు ఉన్నతమైన న్యాయాధిపతి ఆత్మ ద్వారా అనుగ్రహించబడిన పవిత్ర లేఖనములే.

బైబిలు యొక్క మానవ వ్యాఖ్యానము మరియు అనువర్తనము పొరపాటుపడదగినవని సార్వత్రికముగా ఉన్న ప్రొటెస్టెంట్ సంఘములన్నీ ఒప్పుకుంటాయి. కాబట్టి, మానవ రచయితలు మాన్యమైనవారు అయినప్పటికీ, వారు సత్యము యొక్క ఉన్నతమైన తీర్పరులుగా మాత్రం కాలేరు. మరియు మన జీవితములకు లేఖనము యొక్క అనువర్తనము అవసరమైనప్పటికీ, మన అనువర్తనములు బైబిలు వలె పొరపాటులేనివి అన్నట్లుగా మనం వ్యవహరించకూడదు.

> మనము ప్రసంగించినప్పుడు, వర్ణన — వివరణ — ఉంటుంది మరియు ఒక అనువర్తనము కూడా ఉంటుంది. దేవుని వాక్యము యొక్క అర్థము ఒకటైయుండాలి, వాక్యభాగము యొక్క అర్థము ఒకటైయుండాలి, మరియు శతాబ్దముల పాటు అది ఒకటే అయ్యుండాలి. అయితే తరువాత, వాక్యభాగమును నేపథ్యములో చూడవలసివచ్చినప్పుడు, అవి నిన్నటి కొరకు మరియు నేటి కొరకు విభిన్నమైన అనువర్తనములను కలిగియుండవచ్చు; ఇది ప్రమాణములో మార్పు కాదు. ఇది కేవలం అనువర్తనలో భిన్నత్వము మాత్రమే.
>
> — డా. మిగుయేల్ నునెజ్, అనువాదము

> లేఖనమునకు ఒక వ్యాఖ్యానము మాత్రమే ఉండగలదు. ఆ ఒక్క వ్యాఖ్యానమునకు మనము పలు అనువర్తనములను పొందవచ్చు, కాని అనువర్తనము వ్యాఖ్యానమునకు

> కట్టుబడి ఉండాలి. మనము ఎల్లప్పుడూ దేవుని వాక్యమును భాష్యము చేయుచు, ఆ వాక్యభాగము లేక వచనము యొక్క దేవుడు ఉద్దేశించిన అర్థమును వెలికితీయుటకు ప్రయత్నించాలి, లేనియెడల మనము స్వభాష్యము చేసే ప్రమాదం ఉంటుంది, దీనిలో మన సొంత అభిప్రాయములను మరియు మన సొంత వ్యాఖ్యానములను, మన సొంత ఆలోచనలను వాక్యభాగము మీద రుద్దుటకు ప్రయత్నిస్తాము. దీనిలో నుండి మనము తప్పిదములైన అనువర్తనములను పొందుకుంటాము, మరియు అవి మీరు బోధించుచున్న లేక ప్రసంగించుచున్న ప్రజలకు హాని కలిగించవచ్చు... కాబట్టి వ్యాఖ్యానము అనువర్తనమునకు కట్టుబడియుండాలి; ఆలాగే అనువర్తనము వ్యాఖ్యానమునకు కట్టుబడియుండాలి.
>
> — రెవ. థడ్ జేమ్స్, జు.

సరియైన అనువర్తనములు లేఖనము యొక్క సంపూర్ణ విలువలో భాగమైయున్నాయి అను విషయమును మనస్సులో ఉంచుకొని, *హెయిడెల్బర్గ్ కేటకిజం* ద్వారా ప్రాతినిధ్యం వహించబడిన మరొక ప్రొటెస్టెంట్ పరంపర హత్యకు విరోధముగా ఇవ్వబడిన ఆజ్ఞను ఏ విధంగా అనువర్తించినదో చూద్దాము. లేఖనము యొక్క సహాయకరమైన మరియు పొరపాటుపడదగిన సారాంశమును ఇచ్చుటకు ఈ కేటకిజం పదహారవ శతాబ్దపు ఐరోపాలో వ్రాయబడింది. *హెయిడెల్బర్గ్ కేటకిజం*లోని 105 ప్రశ్న ఈ విధంగా ప్రశ్నిస్తుంది:

> ఆరవ ఆజ్ఞలో మీ కొరకు దేవుని చిత్తము ఏమిటి?

మతోపదేశము ఇచ్చిన జవాబు:

> నేను నా పొరుగువానిని చిన్నచూపుచూడకూడదు, అపహసించకూడదు, ద్వేషించకూడదు, లేక చంపకూడదు, కాని నా ఆలోచనల ద్వారా, నా మాటల ద్వారా, నా చూపు లేక సైగల ద్వారా, మరియు నేను చేయు క్రియల ద్వారా ఈ కార్యములలో నేను ఇతరులకు సహకరించకూడదు; బదులుగా, ప్రతీకారేచ్ఛను నేను పూర్తిగా విడిచిపెట్టాలి. అలాగే నన్ను నేను కూడా గాయపరచుకోకూడదు లేక నిర్లక్ష్యంగా అపాయములో పడవేసుకోకూడదు.

కేటకిజం హత్యకు విరోధముగా ఇవ్వబడిన ఆజ్ఞను మత్తయి 5లో యేసు ఇచ్చిన ఉల్లేఖనములు మరియు రోమా 12లో ప్రతీకారమును గూర్చి పౌలు చేసిన బోధతో సహా అనేక బైబిలు ఉల్లేఖనముల వెలుగులో వ్యాఖ్యానిస్తుంది.

ఇక్కడ మనము చూచుచున్నట్లు, “హత్య చేయకూడదు” అనే ఒక సులువైన ఆజ్ఞ యొక్క సంపూర్ణ విలువ ఎంతో సంక్లిష్టముగాను, అనేక కోణములు కలిగినదిగాను ఉండగలదు. యేసు మరియు పౌలును

అనుసరించి, *హెయిడెల్బెర్గ్ కేటకిజం* యొక్క రచయితలు ఈ ఆజ్ఞను కేవలం అన్యాయముగా మానవ జీవితమును తీయుటకు మాత్రమే అనువర్తించలేదుగాని, ద్వేషము మరియు అవమానముల వంటి హత్యను పోలిన వాటికి కూడా అనువర్తించారు. ఇట్టి అనువర్తనములు హత్యను నిషేధించు ఉద్దేశము గల వాస్తవిక అర్థము మీద, దాని బైబిలు ఉల్లేఖనముల మీద ఆధారపడియున్నాయి, మరియు అవి మన సమకాలీన పరిస్థితులకు సరిపడునవిగా ఉన్నాయి. ఈ కారణముల చేత, హత్యకు విరోధముగా ఇవ్వబడిన ఆజ్ఞ యొక్క సంపూర్ణ విలువలో అవి భాగమైయున్నాయి.

> అయితే, "'నరహత్య చేయకూడదు' అను ఆజ్ఞను అనువర్తించుటకు సరియైన మార్గములు ఏవి?" అను ప్రశ్నను మీరు అడిగినట్లయితే, మనము ప్రజలను చంపకూడదు అను అర్థము దానిలో స్పష్టముగా ఉన్నది. అయితే ఆజ్ఞ ఇంత మాత్రమే చెబుతుంది అని చెప్పుట సమంజసం కాదు. మీరు మీ సహోదరుని మీద కోపపడితే, అది హత్య చేయుటతో సమానమని యేసు స్వయంగా కొండ మీద ప్రసంగములో సెలవిచ్చాడు. తరువాత ప్రజల మీద మనము చూపు కోపము మరియు అసహనము ఆ ఆజ్ఞను ఉల్లంఘిస్తుంది అని చూచునట్లు ఆయన మనలను ప్రోత్సహించాడు. కాబట్టి దానిని నేడు అనువర్తించుకొను విషయములో, పది ఆజ్ఞలు నేడు కూడా ఔచిత్యమైయున్నవి అని చూచుటలో ప్రజలకు సహాయము చేయుట చాలా అవసరమని నా ఆలోచన, ఎందుకంటే దేవునికి విరోధముగా చేయు తప్పిదము యొక్క తీవ్రతను అవి అర్థము చేసుకుంటాయి, మరియు మనము వాటిని చూచుచుండగా, అది ఆశించుట కావచ్చు, లేక క్రోధము, లేక ఇతర అభిలాషలు మరియు వాంఛలు కావచ్చు, వాటితో దేవుడు హృదయ స్థాయిలో వ్యవహరించని యెడల అవి మరింత హానిని కలిగించు ప్రమాదం ఉన్నది. కాబట్టి బైబిలు భాగము యొక్క అనువర్తనము, రానురాను మరింత తీవ్రమవ్వగల సమస్యలను చిగురులోనే తుంచివేయునట్లు ప్రజలకు సహాయము చెయ్యాలి. వాస్తవానికి చిగురు స్థాయిలో ఉన్న సమస్య కూడా తీవ్రమైనదేనని కొండ మీద ప్రసంగములో యేసు సెలవిచ్చుచున్నాడు.
>
> — డా. సైమన్ విబర్ట్

కొండ మీద ప్రసంగములో, యేసు ధర్మశాస్త్రము మీద తన యొక్క అధికారిక బోధనను మనకు ఇచ్చుచున్నాడు, మరియు ఆయన చేయుచున్న ఒక పని ఏమిటంటే, ఆ ఆజ్ఞలను తీసుకొని వాటిని లోతైన హృదయ స్థాయికి నెట్టుటకు ప్రయత్నించుచున్నాడు. కాబట్టి "నరహత్య చేయవద్దు అని చెప్పబడిన మాట మీరు విన్నారు గదా" అని ఆయన చెప్పినప్పుడు, అది వాస్తవమైయున్నది. అయితే యేసు ఒక అడుగు ముందుకు వెళ్లి ధర్మశాస్త్రము యొక్క నిజమైన ఉద్దేశమును మనకు



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

> చూపుచున్నాడు. మనము హత్య చేయకపోవుట మాత్రమే కాదుగాని, మనము హత్యకు సంబంధించిన మాటలను, ద్వేషముతో కూడిన మాటలను, "ఓ మూర్ఖుడా" అను మాటను పోలియున్న మాటలను కూడా పలుకకూడదు. లేక, మనము మన సహోదరుని ద్వేషించకూడదు. మరొక మాటలో, నిర్గమకాండములో, పది ఆజ్ఞలలో ఉన్న ధర్మశాస్త్రము ఒక పనిని చేయకపోవుటను గూర్చినది మాత్రమే కాదు. ఈ నియమములను చదువునప్పుడు మనము అర్థము చేసుకొనవలసిన ఒక లోతైన ఉద్దేశము ఉన్నదని ఆయన మనకు చూపుచున్నాడు. కాబట్టి ఈ నియమములను అర్థము చేసుకొను విధానము కేవలం నిషేధించుట మాత్రమే కాదుగాని, ఒక ఖచ్చితమైన ఆజ్ఞ కూడా ఇవ్వబడినది. "హత్యచేయకూడదు" అని మాత్రమే కాదుగాని, "జీవమును ప్రకటించండి" అను అర్థము కూడా ఉన్నది … కాబట్టి పాత నిబంధనలోని ప్రాముఖ్యమైన భాగములను యేసు వివరించుచుండగా, ఆయన దానిని చివరికి రెండు విషయములకు పరిమితము చేస్తాడు: మన పూర్ణ హృదయముతో దేవుని ప్రేమించుట మరియు మన వలె మన పొరుగువారిని ప్రేమించుట. ప్రేమించమని ఇవ్వబడిన ఒక స్పష్టమైన ఆజ్ఞ ధర్మశాస్త్రము యొక్క నిజమైన ఉద్దేశమైయున్నది.
>
> — డా. బ్రాండన్ క్రో

ఆధునిక లోకములో, బైబిలు హత్యను నిసేధించుటకు సంబంధించిన విషయములను గూర్చి క్రైస్తవులు అనేక రకముల నిర్ణయములను తీసుకొనవలసియుంటుంది. గర్భవిచ్ఛిత్తి, అనాయాసమరణము, ఆత్మహత్య, యుద్ధము, నిరుపేదరికము మరియు అనేక ఇతర అపాయముల రూపములో మానవ జీవితము మరియు గౌరవము మీద అనేక దాడులను మనము ఎదుర్కొంటాము. ప్రతి సందర్భములోను, హత్యకు విరోధముగా ఇవ్వబడిన ఆజ్ఞ మనలను బాధ్యులుగా చేస్తుంది. మరియు లేఖనము యొక్క వ్యాఖ్యానకర్తలుగా ఆ బాధ్యతలు ఏమిటో కనుగొనుట మనము కలిగియున్న పనులలో ఒకటైయున్నది. మనము అలా చేయుచుండగా, ఆజ్ఞ యొక్క నిజమైన అర్థము ఏమిటో మనము మరింత సంపూర్ణముగా బయలుపరచగలుగుతాము.

## ముగింపు

అర్థము యొక్క సంక్లిష్టతను గూర్చిన ఈ పాఠంలో, లేఖనము యొక్క అక్షరార్థ భావనను దాని యొక్క ఏక, వ్యాకరణ-చారిత్రిక అర్థముగా దృష్టించు చరిత్రను మనము చర్చించాము, మరియు ఒక బైబిలు

భాగము యొక్క వాస్తవిక అర్థము, బైబిలు ఉల్లేఖనములు, మరియు సరియైన అనువర్తనముల దృష్ట్యా దాని యొక్క సంపూర్ణ విలువను వర్ణించాము.

ఈ పాఠంలో మనము చూసినట్లు, ప్రతి బైబిలు భాగమునకు ఒక సంక్లిష్టమైన వాస్తవిక అర్థము ఉన్నది. అది ఎంత సంక్లిష్టమైనది అంటే, అది వాస్తవిక శ్రోతల యొక్క భావనలను, ప్రవర్తనలను మరియు భావోద్వేగములను అనేక విధాలుగా తాకుతుంది. అయితే దీనిని మించి, ఈ సంక్లిష్టమైన వాస్తవిక అర్థమునకు అనేక పాక్షిక సారాంశములు కూడా ఉన్నాయి. వాస్తవిక అర్థము మన అవగాహనకు ఒక పొరపాటులేని ఆకారమును, పునాదిని అందిస్తుంది. అయితే లేఖనము యొక్క సంపూర్ణ విలువను గూర్చిన అవగాహనను పొందుటకు, మనము బైబిలు ఉల్లేఖనములలో సహాయమును కనుగొనాలి మరియు నేటి మన లోకము కొరకు అనేక సరియైన అనువర్తనములను కూడా మనము చెయ్యాలి.